# తప్పనీదే కాదు

**-కోపూరి పుష్పాదేవి**

"**రా**వే వసూ...", గుమ్మంలో ఆటో దిగిన చెల్లెల్ని ఆప్యాయంగా ఆహ్వానించింది రాజేశ్వరి. ఆమె చేతిలోని సూట్‌కేస్ అందుకుంటూ.

"మరిదిగారూ, నరేషూ బాగున్నారా..." కుశల ప్రశ్నలు అడుగుతూనే, మంచినీళ్ళు తెస్తానుండు" అంటూ వంట గదిలోకి వెళ్ళింది రాజేశ్వరి.

"హుష్" అంటూ సోఫాలో కూలబడింది వసుమతి. జనంతో క్రిక్కిరిసి ఉన్న ట్రైనులో ప్రయాణం చేసి రావడం వల్ల, ఆమెకు ఒళ్ళంతా చాలా చికాకుగా ఉన్నది. "అబ్బో.. ఏర్పాట్లు చాలా ఘనంగా చేస్తున్నట్లుందే అక్కా..., ఊరందరినీ పిలిచిందా ఏమిటి పేరంటానికి..." హాల్లో ఉన్న సరంజామా చూసి అనుకున్నది వసుమతి. "అందరూ బాగానే ఉన్నారక్కా ఎంతవరకు వచ్చాయి పనులు..." మంచినీళ్ళు గడగడ త్రాగి అడిగింది వసుమతి.

"హాయ్ పిన్నీ... ఒక్కదానివే వచ్చావా... నరేష్‌ని తీసుకురాకుండా..." బుంగమూతి పెట్టింది సమర్త పెళ్ళి కూతురు, అరుణ.

"ఏయ్ ఇటురాకు. అన్నింటినీ ముట్టుకుంటావు. నువ్వు గదిలోకి పో..." కసిరింది రాజేశ్వరి.

"అబ్బ... ఇంకా ఎన్నాళ్ళమ్మా ఈ గోల..., అది తాకకూ, ఇది ముట్టకూ అంటారు.. నన్నా జైల్లో పడేశారు..." విసుక్కుంటూ గదిలోకి వెళ్ళింది అరుణ.

"ఇంకా నాలుగు రోజులేలే. కొద్దిగా ఓపిక పట్టు" సముదాయించింది వసుమతి నవ్వుతూ.

"హాయ్ పిన్నీ, ఎంత సేపయింది వచ్చి..." అంటూ వసుమతిని చుట్టేశారు అప్పుడే స్కూలు నుండి వచ్చిన అరుణ చెల్లెళ్ళు కావ్య, రమ్య. "ఇంతకు ముందే వచ్చానురా, మీరు బాగా చదువుతున్నారా..." వాళ్ళను దగ్గరకు తీసుకుంది వసుమతి. "ఏయ్ ఏమిటిది... ఇద్దరూ మీద పడి పోయారు, పిన్నికి ఊపిరాడకుండా.." గదిమింది రాజేశ్వరి.

"ఫర్వాలేదులే అక్కా... ఎంతవరకూ వచ్చాయి పనులు..." సూట్‌కేస్ నుండి ఐదువేలు తీసి, రాజేశ్వరి చేతికిస్తూ అడిగింది వసుమతి.

"ఏదీ, అయిన రోజునే రమ్మంటే, ఏడో రోజుకి వచ్చావు. మీ ఆయనకూ, కొడుక్కూ ఇబ్బంది అవుతుందని. మా అత్తగారూ, ఆడబడుచులూ అయిన రోజునే వచ్చారు కాబట్టి సరిపోయింది. అయినా, నరేష్‌ను కూడా తీసుకురాకపోయావేటే... ఇలాంటప్పుడన్నా సరదాగా నాలుగు రోజులుండేవాడు.." అడిగింది రాజేశ్వరి సోఫాలో చెల్లెలి ప్రక్కనే కూర్చుంటూ.

"అమ్మో... నాలుగు రోజులే... సెవంత్ క్లాస్ పరీక్షలు దగ్గర కొస్తుంటే... అయినా, ఆడపిల్లల వేడుకలకు నేను రావడమేమిటీ అన్నాడు. గట్టిగా చెప్తే పదకుండో రోజు ఫంక్షనుకు వాళ్ళ నాన్నగారితో కలిసి వస్తానన్నాడు" అన్నది వసుమతి స్నానానికి లేస్తూ. రాజేశ్వరి అత్తగారూ, ఆడబడుచులూ వసుమతిని "బాగున్నావా.." అంటూ మర్యాదకు పలుకరించి, గదిలోకి వెళ్ళిపోయారు ఏదో అర్జంట్ పని ఉన్నట్లు.

❖ ❖ ❖

వసుమతికి ఇద్దరు అక్కలూ, ఒక అన్నయ్య. ఆమె పుట్టిల్లు వైజాగ్. రాజేశ్వరి పెద్దక్క. రెండో ఆమె భువనేశ్వరి. ఆమెది హైదరాబాద్. రాజేశ్వరికి ముగ్గురూ కూతుళ్ళే. ఇప్పుడు పుష్పవతి అయిన అరుణ పెద్దది. భర్త సత్యనారాయణ సెంట్రల్ వేర్ హౌస్‌లో క్లర్క్. వాళ్ళు ఇప్పుడు ఉంటున్న ఆ పాత చిన్న పెంకుటిల్లు తప్ప. వేరే ఆస్తిపాస్తులేమీ లేవు. రాజేశ్వరి భర్త నిదానస్తుడు. రాజేశ్వరికి అట్టహాసాలూ, ఆడంబరాలూ ఎక్కువ. డబ్బు ఖర్చుపెట్టే విషయంలో తమ స్థితిగతులను పట్టించుకోదు ఆమె. ఈ విషయంలో సత్యనారాయణ చాలా బాధపడ్తాడు. భార్యకు చెప్పి ఒప్పించడం అతని వల్ల అవని పని. పది రోజులూ సింపుల్‌గా, ముగ్గురు ముత్తయిదువలను పిలిచి, అమ్మాయికి హారతి ఇచ్చి, చివరి రోజు కొంచెం గ్రాండ్‌గా ఫంక్షన్ చేసుకుందామన్నాడు ఆయన. "ఛా... అలా కుదరదు. ప్రతి

## మనసు

**మ**నసు / అందమైన అద్దం
నువు నవ్వితే నవ్వుతుంది
నువు ఏడిస్తే ఏడుస్తుంది

**-కాళహస్తి వెంకట శేషగిరిరావ్**

రోజూ బంధు మిత్రులందరినీ పిలిచి, ఘనంగా పేరంటం చేసి, రోజుకొక వస్తువు పంచిపెట్టాలని పట్టుపట్టింది రాజేశ్వరి. పది రోజులూ ఇంటికి విద్యుత్తు బల్బుల తోరణాలూ, పిల్లలు ముగ్గురికీ పట్టుబట్టలూ, తనకొక పట్టుచీరా, దగ్గరి చుట్టాలకు బట్టలూ, పదకొండో రోజుకు పెద్ద కల్యాణ మండపం బుక్ చెయ్యమంటూ..." పెద్ద లిస్ట్ చెప్పింది రాజేశ్వరి.

సత్యనారాయణ గుండె ఆగినంత పనయింది. కూతురికి అచ్చట్లూ, ముచ్చట్లూ జరపాలని అతనికి

## మెరుగు నానీలు

తల్లి ఒడిలో
పసి బిడ్డలు
చెట్టు తల్లికి
పూలు, పండ్లు- చూడముచ్చట.

రవిచంద్రులు
ఆకసాన తిరుగుచుందురు
అనుక్షణం
తిమిరాలను తరుముచుందురు.

పుస్తకము
కనుదోయి ద్వారా
మస్తకములో
అచ్చవుతుంది.

తులసి మొక్కకు
కుండీయే అండ
మొక్కలు మొక్కకా?
అండ ఉన్న కుండీకా?

పశుత్వం క్షణంలో
పతనమవాలి
మానవత్వం సదా
పరిమళించాలి.

ఊహలు
మెరిసి మెరిసి
మేధస్సు నుండి
భావాల వర్షం కురుస్తుంది

అనురాగం
అమ్మలా ఉంటే
ఆత్మీయత
నాన్నలా ఉంటుంది-బిడ్డకు.

-రేగులపాటి కిషన్‌రావు

మాత్రం ఉండదూ..., కానీ బడ్జెట్ ఆమోదించాలి కదా...? నా వల్ల కాదన్నాడు అతను. "అయితే, మా చెల్లెళ్ళిద్దరినీ చెరొక అయిదువేలూ పట్టుకు రమ్మంటాను. నిదానంగా అప్పు తీరుద్దాము..." అంటూ తరుణోపాయం చెప్పింది రాజేశ్వరి.

మధ్యాహ్నం భోజనాల దగ్గర, చెల్లెలి ప్రక్కనే కూర్చుని, కొసరి కొసరి వడ్డించింది రాజేశ్వరి. వసుమతికి చనిపోయిన తల్లి గుర్తువచ్చింది. "ఎంతయినా రక్త సంబంధం" అనుకుంటూ మురిసిపోయింది. "మా అత్తగారు ఒకరోజూ, ఆడబడుచులిద్దరూ చెరొక రోజూ చిమ్మిరి తొక్కించారు" చెప్పింది రాజేశ్వరి చెల్లెలికి పెరుగు వడ్డిస్తూ. "నేను కూడా ఈ రోజు తొక్కిస్తాను అక్కా... ఈ రోజు ఖర్చంతా మాది..." అన్నది వసుమతి. "నాకెటూ కూతుళ్ళు లేరు. ఆ ముచ్చట ఇలా తీరుతుంది..." అనుకుంటూ.

మరునాడు భువనేశ్వరి వచ్చింది భర్తా, పిల్లలతో సహా. వాళ్ళు కోటీశ్వరులు. ఆమె భర్త యూనివర్సిటీ ప్రొఫెసరు. రాజేశ్వరి ఆ చెల్లెలికీ, మరిదికీ మర్యాదలు చెయ్యడంలో మునిగిపోయి, వసుమతికి వంటపని అప్పచెప్పేసింది. "అందుకే బావగారిని ఈ పది రోజులూ వంట మనిషిని పెట్టమన్నాను" వినలేదు అంటూ. అంత పని చెయ్యాలంటే కష్టంగా ఉన్నా వసుమతి పంటి బిగువున చేస్తోంది. "అవసరానికి చెయ్యకపోతే ఎలాగ...?" అనుకున్నది. రాజేశ్వరి అత్తగారు గానీ, ఆడబడుచులు గానీ ఆమెకు కొద్దిగా కూడా సాయం చెయ్యడం లేదు.

ఈ పది రోజులూ పెళ్ళి వంటలూ, బంతి భోజనాలూ ఆ ఇంట్లో. ప్రతిరోజూ పేరంటాన్ని వీడియో షూటింగూ, ఫోటోలతో భద్రపరుస్తున్నారు. "ఎంత ఖర్చో" అని సత్యనారాయణ గుండెలు బాదుకుంటున్నా, మేకప్ మాన్ చేత సమర్త పెళ్ళి కూతురికి లక్ష్మి అని, సరస్వతీదేవి అని, శకుంతల అనీ రోజుకొక వేషం వేస్తున్నారు. భువనేశ్వరి వచ్చిన దగ్గర నుండి ఆమే, రాజేశ్వరీ కబుర్లు చెప్పుకుంటూనే ఉన్నారు. మరీ అన్ని కబుర్లేముంటాయో వసుమతికి అర్థంకాదు. ఒక రోజు షాపింగు అంటూ ప్రొద్దున వెళ్ళి సాయంత్రానికి వచ్చారు. "నువ్వు కూడా రా" అని వసుమతిని మర్యాదకు కూడా పిలవలేదు. వంటపనీ, మిగతా పనులూ వసుమతిదే బాధ్యత అన్నట్లు ప్రవర్తించ సాగింది రాజేశ్వరి. వసుమతికి మనసులో కష్టంగా ఉన్నా, అక్కే గదా, పోనీలే అని సరిపెట్టుకున్నది. పదకుండో రోజు ఫంక్షను అతి గ్రాండ్‌గా జరిగింది పెళ్ళికన్నా ఎక్కువగా అన్నట్లు.

❖ ❖ ❖

అప్పులతో ఆడంబరం చేసుకునే వారికి, ఇతరుల పెట్టుపోతల విషయం వచ్చేసరికి, ఎక్కడలేని పొదుపూ గుర్తు వస్తుంది. వసుమతి వెళ్ళి వస్తానంటే, పది రూపాయల జాకెట్ ముక్క పసుపు కుంకుమ పెట్టింది రాజేశ్వరి.

❖ ❖ ❖

"మీ అక్కా, బావగార్లకు అసలు జ్ఞానం ఉందా వసూ... మెచ్యూర్ ఫంక్షనుకు అంత ఆర్భాటమా..? అదీ అప్పులు చేసి... మనం ఇచ్చామని కాదు నా బాధ... ఇప్పుడీ అమ్మాయికి చేస్తే సరిపోయిందా.. రేపు మిగతా ఇద్దరికీ కూడా ఇంత ఘనంగానూ చెయ్యక పోతే, వాళ్ళు బాధపడతారు. మా కొలీగ్ ఇంట్లో అలాగే జరిగింది. వాళ్ళ చదువులూ, పెళ్ళిళ్ళూ ఎన్నెన్ని ఖర్చులు ఉన్నాయి ముందు ముందు...?" అన్నాడు వసుమతి భర్త ప్రకాశరావు ట్రైనులో.

"ఇందులో బావగారి తప్పేమీ లేదు. ఆయన ఎంత చెప్పినా, అక్క వింటేగదా..., చిన్నక్కా మనమూ ఇచ్చిన పదివేలు కాక, మరో పదిహేను వేలయినా అయ్యుంటాయి. ఇప్పుడు అనవసరంగా ఇంత ఖర్చుపెట్టి, రేపు నేను దానిని కాలేజ్‌లో చేర్పించను, ముగ్గురి చదువుల ఖర్చు తట్టుకోవద్దా అంటోంది అక్క" అన్నది వసుమతి.

"ఛఛ... ఇంత బుర్ర లేకుండా మనుష్యులు ఎలా ఉంటారో అర్థంకాదు..." అన్నాడు ప్రకాశరావు రైలు స్టేషన్ సమీపిస్తుండడంతో సామాను చేతిలోకి తీసుకుంటూ "అనవసరంగా నాకు మ్యాథ్స్ క్లాసులు పోయాయి. నేను రాకుండా ఉంటే పోయేది..." గొణుక్కుంటూ ట్రైన్ దిగాడు నరేష్.

❖ ❖ ❖

వసుమతికి ఈ మధ్య ఓవర్ బ్లీడింగ్ సమస్య పట్టుకుంది నాలుగు నెలల నుండి. మందులు వాడినా తగ్గలేదు. గైనకాలజిస్టు హిస్టరెక్టమీ ఆపరేషన్ చేయించుకోమని సలహా ఇచ్చారు. ఓవరీస్ ఉంచితే సమస్యలేవీ రావన్నారు. ఆ మేజర్ ఆపరేషన్ అంటే భయంగా ఉన్నా, ఇష్టంలేకపోయినా తప్పలేదు వసుమతికి.

ఆపరేషన్ అయి, వారం రోజులు ఆస్పత్రిలో ఉన్నప్పుడు, వసుమతి అన్నా, వదినా, చిన్నక్కా వచ్చి చూసి వెళ్ళిపోయారు. కానీ, రాజేశ్వరి మాత్రం నెల రోజులుండి, చెల్లెలి మంచీ చెడూ అన్నీ చూసింది తల్లి లేని లోటు తెలియకుండా. కృతజ్ఞతతో వసుమతి మనసు నిండిపోయింది. "చాలా థ్యాంక్స్ అక్కా..." అన్నది

## ఎయిడ్స్‌కై ఎయిడ్స్

సబ్బుబిళ్ళ నుండి దగ్గు బిళ్ళ దాకా
ముట్టు గుడ్డ నుండి 'మూడ్స్' దాకా
వళ్ళంతా ముద్దుల నుండి ఉబికిన అండర్‌వేర్ దాకా
జీన్సులు కార్గోల నుండి షార్టులు బికినీల దాకా...
**'యాడ్'లు కసికసిగా సహజాత్వాన్ని రెచ్చగొడుతుంటే..**
వెండి తెరల నిండా పమిటల్లేని
మాంసం ముద్దలు కైపు ఎక్కిస్తుంటే
బుల్లి తెరల్లో అనుక్షణం రంగు రంగుల
నీలి చిత్రాల భంగిమలు హావభావాలు
**నిలకడతనానికి ప్రతి నిమిషం నిప్పుపెడుతూ వుంటే..**
చూపించరానివి చూపించే బారుల వ్యాపారులు
'అర్థం' మదంతో- ఏవేవో మార్చుకొనే మదవికారులు
క్లబ్బులు-పబ్బులు-బూతుపాటల అశ్లీల నృత్యాలు
మాదక ద్రవ్యాలు- బారులు తీరిన కామ'కారులు'
**ఇవన్నీ నాగరికతగా ఇక్కడ- అక్కడ అంతటా కిర్రెక్కిస్తుంటే..**
ఉమ్మడి ఊహే రానీయని ఇరుకు సంసా రాలు
సంతానాల మెళుకువ ఊసేలేని రేబవళ్ళ శృంగారాలు
పవిత్ర సంబంధాలనే పరిజ్ఞానం లేని కుళ్ళు జోకులు
బడుల్లో గుడుల్లో దాడులు; హత్యలు-మాన భంగాలు
**ఇలా అంటించిన అడవి ఆగకుండా తగలడి పోతుంటే..**
కిర్రెక్కిన ఆరేళ్ళ అన్న మూడేళ్ళ చెల్లితో...
కైపెక్కిన అరవైఏళ్ళ తాత పదేళ్ళ మనవరాలితో
రెచ్చిపోయిన మావ స్వయానా కోడలితో
వెర్రెక్కిన తండ్రి సయితం తన కూతురితో..
**బడి, గుడి, ఒడి, కానక గుడిసేటి పనులు జరుగుతుంటే**

**మీ అమ్మ కడుపు మాడ!!**
పులిరాజుకు ఎయిడ్స్ వస్తుందా? నిశ్శబ్దాన్ని ఛేదిద్దాం రా
కండోమ్స్ బాక్సులు ఉన్నాయండోయ్!
అవగాహన ఏర్పర్చుకోండర్రా
అంటూ ఏమిటిరా మీ వెధవ గోల
ఏమిటిరా ఊరూరా మీ మీటింగుల జాతర
**మీమీ ఉత్పత్తులు పెంచుకొనే జిమ్మిక్కులు తప్ప**
**ఎయిడ్స్ పెరగటానికి యథాశక్తి అందిస్తున్న ఎయిడ్స్ తప్ప!**

-మహమ్మద్ ఖాదర్ ఖాన్

కన్నీరు పెట్టుకుంటూ. "థ్యాంక్సా, నీ మొహమా..., నాకు నువ్వూ, నీకు నేనూ చెయ్యడంలో విశేషం ఏముందే పిచ్చిదానా..." అంటూ చెల్లెలి తల నిమిరింది ఆప్యాయంగా రాజేశ్వరి. "ఈ మధ్య చేయించు కున్నానే..." అంటూ రెండు జతల బంగారు గాజులు చూపించింది వసుమతికి.

"మరి, మాకు ఇవ్వవలసిన డబ్బూ..." అని అడగబోయి మానేసింది వసుమతి. అలా అడిగితే అక్క బాధ పడుతుందని. ఆ విషయం భర్తకు చెప్పకుండా దాచింది. రాజేశ్వరి వెళ్ళేటప్పుడు మంచి చీర పెట్టి పంపింది.

❖ ❖ ❖

రాజేశ్వరి ఫోన్ చేసింది ఆ రోజు వసుమతికి. "అరుణకు పెళ్ళి సంబంధం కుదిరేటట్లు ఉన్నది. భువన ఎంతో కొంత ఇస్తామన్నది. మీరు కూడా ఏమన్నా సర్దుతామంటే, ఆ సంబంధం ఖాయం చేసుకుం టాము...' అంటూ, "మీ మరిది గారిని అడిగి చెబుతా నక్కా" అన్నది వసుమతి. ఆ రాత్రి భర్త దగ్గర ఆ విషయం ప్రస్తావించింది.

"అసలేమిటే మీ అక్కా వాళ్ళు... నిండా పదహారేళ్ళు లేవు. అప్పుడే ఆ పిల్లకు పెళ్ళా...? చదివించడానికేమో డబ్బులుండవు. పెళ్ళికయితే వచ్చేస్తాయి. అదీగాక.. మనకివ్వవలసిన ఐదువేల మాట ఏం చేశారు...? అప్పుడే తీసుకుని, రెండేళ్ళయింది. వడ్డీ మాట వది లేసినా, అసలయినా ఫలానప్పుడు ఇస్తానని మాట కూడ చెప్పరే... అసలందుకే మన పెద్దవాళ్ళు అయిన వాళ్ళతోనూ, స్నేహితులతోనూ ఆర్థిక లావాదేవీలు పెట్టుకోకూడదంటారు..." అన్నాడు ప్రకాశరావు పక్కమీద వాలుతూ.

"అవసరానికి స్నేహితులనూ అడగక, అయిన వారినీ అడగక, మరి ఎవరిని అడగమంటారు...? వాళ్ళే ఇస్తారు లెండి వీలు చూసుకుని... అప్పు తీర్చ మని మనం అడిగితే ఏం బాగుంటుంది...? ఇప్పుడీ మాట చెప్పండి, పెళ్ళికి మనం కూడా ఏమన్నా సర్దుతా మంటే ఖాయం చేసుకుంటారట... మంచి సంబంధ మట... చిన్నక్క కూడా ఇస్తానందట..." అలమార నుండి దుప్పట్లు తీస్తూ అన్నది వసుమతి.

"మీ చిన్నక్క ఎందుకివ్వదూ... కోటీశ్వరురాలు. ఆయనకు చూస్తే పెద్ద ఉద్యోగం. భారీ శాలరీ. వాళ్ళ లాగా మనమేమన్నా ఆస్తిపరులమా... లేక ఆయనకు మల్లే నేనేమన్నా పెద్ద జీతం పుచ్చుకుంటున్నానా...? ఒక్క అబ్బాయితో సరిపెట్టుకుని, తెలివిగా, పొదుపుగా సంసారం లాక్కు వస్తున్నాము కాబట్టి. చేతిలో ఈ నాలుగు రాళ్ళయినా ఆడుతున్నాయి గానీ..." అన్నాడు ప్రకాశరావు వీక్లీ ఒకటి చేతిలోకి తీసుకుంటూ.

"వాళ్ళ సంగతి మనకెందుకు... స్థలం ఏమైనా కుదిరితే కొందామని, డబ్బు బ్యాంకులో వేశారు గదా.., అందులోది ఏమన్నా ఇవ్వండి. వీలు చూసుకుని, వాళ్ళే తిరిగి ఇచ్చేస్తారు. ఆడపిల్ల పెళ్ళికి సాయం చేసిన వాళ్ళమవుతాం..." అన్నది వసుమతి ఆవలిస్తూ. కాదంటే భార్య బాధ పడుతుందని, "అలాగే" అన్నాడు ప్రకాశరావు నిద్ర కుపక్రమిస్తూ.

అరుణ పెళ్ళి కూడా గ్రాండ్‌గానే జరిగింది. ఏడాదిలోపే కొడుకు కూడా పుట్టాడు. అప్పు తీసుకోవ డమే గానీ, తిరిగి తీర్చే విషయం అస్సలు ఆలోచించదు రాజేశ్వరి. తీసుకున్న అప్పులు ముళ్ళలా గుచ్చుతుంటే, తీర్చెయ్యాలనే ఉంటుంది గానీ సత్యనారాయణ గారికి, ఆ పనే చేత కావటంలేదు ఆయనకి. ఒకచోట అప్పు తీర్చాలంటే, మరొకచోట చెయ్యవలసిందే.

"మంచి స్థలం అమ్మకానికి వచ్చింది. రేటు కూడా అనుకూలంగా చెప్తున్నారు. మీ అక్కా వాళ్ళని అడిగి, మన డబ్బు తీసుకురా, లేటయితే, స్థలం చేజారి పోతుంది..." అంటూ భార్యను వత్తిడి చేస్తున్నాడు ప్రకాశరావు.

"వాళ్ళు చూస్తే ఇచ్చే పరిస్థితిలో లేరు. ఇస్తావా.. చస్తావా... అన్నట్లు పీక మీద ఎలా కూర్చోను.." అనుకుంటూ వసుమతి బాధ పడుతోంది. అక్కడికీ అడగలేక, అడగలేక అడిగింది ఒకరోజు వెళ్ళి.

"మేం ఇప్పటికిప్పుడు మీ బాకీ తీర్చలేము. మీకంత అర్జంట్ అయితే, ఉన్న ఈ ఒక్క పాతకాలపు కొంపా అమ్మేసి, మేము కుటుంబం అంతా వీధినబడి అయినా సరే, మీ అప్పు తీర్చేస్తాం తల్లీ..." అన్నది నిష్ఠూరంగా రాజేశ్వరి.

రాజేశ్వరి చెప్పిన ఆ జవాబుకి వసుమతి నిర్ఘాంత పోయింది. "అందుకేనేమో... మన పెద్దలు అంత్య నిష్ఠూరం కన్నా, ఆది నిష్ఠూరం మేల"ని అన్నారు. ఆయన ఎంత చెప్పినా వినకుండా, అపాత్రదానం చేసినట్లు, తోడబుట్టిన దానివనీ, అవసరంలో ఉన్నావనీ, నీ స్వభావం తెలిసి కూడా, నీకు అప్పు ఇచ్చిన నాది తప్పు అవుతుంది గానీ, ముమ్మాటికీ ఇది నీ తప్పు కాదు. అక్కా ముమ్మాటికీ కాదు..." నిర్లిప్తంగా అను కుంటూ, నీరసంగా వెనుదిరిగింది వసుమతి. ■